ఆమె అక్కడ్నుంచి కదిలింది.

ఇద్దరూ టిఫిన్ చేయడం పూర్తయ్యే సరికి, వేడిగా కాఫీలు అందించిందామె.

"అమ్మమ్మా! మేం బయటకు వెళుతున్నాం. మళ్ళీ తిరిగి వచ్చేది రాత్రికే. కాబట్టి నీకు ఒక్కదానికే వంట చేసుకో" కాఫీతాగి కప్పు టేబుల్ మీద వుంచి అన్నాడు అభిరాం.

"అలాగే" అందామె.

"వస్తాం అమ్మమ్మా" అంటూ లేచారు అభిరాం, మహదేవ్‌లు.

"మంచిది. పెందలాడే వచ్చేయండి" అంది సుమతమ్మ.

"అలాగేలే!" అన్నాడు అభిరాం.

గేట్లు తెరిచి, కారులో కూర్చుని స్టార్ట్ చేసి బయటికి తీసుకొచ్చాడు కారుని, మహదేవ్ గేట్లు వేసేసి కారు డోర్‌తీసి అభిరాం పక్కన కూర్చోగానే ముందుకు దూసుకుపోయింది కారు.

"టిఫిన్ చేస్తున్నప్పుడు అడగటం మర్చిపోయాను. ఎక్కడికెళుతున్నాం మనం?" అడగాడు మహదేవ్.

"వరంగల్"

"వరంగలా?"

"అవును."

"అంత దూరమెందుకురా?"

"స్పీడుగా వెళితే టూ అవర్స్‌లో వుంటామక్కడ."

"అక్కడికే ఎందుకు ..... ?"

"అక్కడ చూడదగ్గది అద్భుతమైన శిల్పసంపదతో పాటు అలనాటి శిల్పులు నిర్మించిన రాజసౌధం వుంది. అది చూసిన తరువాత వరంగల్‌కి దగ్గరే వున్న హనుమకొండలో కాకతీయులు కట్టించిన 'వేయి స్తంభాల' గుడిని కూడ చూద్దాం."

"ఓకే! నేనూ వాటి గురించి విన్నాను. కానీ చూడలేదు ఇంత వరకూ."

"ఓ ఆర్కిటెక్చర్‌గా నీకీ ట్రిప్ ఆనందాన్ని కలిగిస్తుందనే అనుకుంటున్నాను నేను."

"గుడ్! నువ్వింతకుముందు చూశావా?" అడిగాడు మహదేవ్.

"లేదు. ఒకటి రెండు సార్లు మా ఎగ్జిక్యూటివ్స్ వాటి గురించి చెప్పారు అంతే. నాకూ ఇదే మొదటిసారి" 'టైం' చూసుకుంటూ అన్నాడు అభిరాం.

ఎనిమిదింపావు అవుతోంది సమయం. అభిరాం గేర్‌మార్చి, ఏక్సిలేటర్ బలంగా అదిమాడు. అంతే ..... అమాంతంగా స్పీడందుకుంది కారు.

నలభై ..... ఏభై ..... అరవై ..... డెభై ..... ఎనభై కిలోమీటర్ల స్పీడుతో దూసుకుపోతుంది కారు. గాలిలో తేలిపోతున్న అనుభూతి. అభిరాం కారుని ఎంత స్పీడ్‌గా డ్రైవ్ చేసినా ఎటువంటి పొరపాటూ చేయడని మహదేవ్‌కి తెలుసు. అందుకే రిలాక్స్‌గా సీటులో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు.

*　　*　　*　　*　　*

సమయం పదీ ముప్పై అయిదు నిమిషాలు.

అభిరాం కారుని స్లోగా పోనివ్వసాగాడు. కారు వరంగల్ నగరంలోనికి ప్రవేశించింది.

"వచ్చేశాం" అన్నాడతను.

"ఎక్స్‌పర్ట్ డ్రైవర్ అవార్డివ్వవచ్చు నీకు ..... " మెచ్చుకోలుగా అన్నాడు మహదేవ్.

"పొగడ్తలు తరువాత. ఇక్కడ అతి ప్రాచీన కాలంనాటి దుర్గం, రాజసౌధం వున్నాయి. అన్నానుగా. అవెక్కడున్నాయో ఎవర్నయినా అడగాలి" అన్నాడు అభిరాం కారు ఆపి కిందికి దిగుతూ.

మహదేవ్ కూడా దిగాడు.

"బాబూ ఇక్కడ ప్రాచీన దుర్గం వుంటుందట కదా ఎక్కడ?" అటే వెళుతున్న ఓ కుర్రాడిని అడిగాడు అభిరాం.

"అంటే?" అర్థం కానట్లు అడిగాడతను.

"అదే శిల్పాలూ, రాతి హంసతోరణద్వారాలూ అవీ వుంటాయికదా" తన ఎగ్జిక్యూటివ్స్ చెప్పినవి గుర్తుతెచ్చుకుని చెప్పాడు అభిరాం.

"ఓ ..... అవా?" అంటూ ఎటు వెళ్ళాలో చెప్పాడా కుర్రవాడు.

వెంటనే అభిరాం, మహదేవ్‌లు కారులో కూర్చుని పది నిమిషాల్లో చేరుకున్నారు అక్కడికి. కారు దిగి లాక్ చేసి ముందుకు నడిచారు.

పూర్వం అక్కడ కోటగానీ దేవాలయం కానీ వున్నట్టు ఒక పెద్ద ప్రహరీ, నాలుగు వైపులా నాలుగు రాతి హంస ద్వారాలు వున్నాయి.

కొంతమంది వాటిని ఫొటోలు తీసుకుంటున్నారు. అభిరాం, మహదేవ్ ముందుకు నడిచారు.

ఇంతలో ఓ పాతికేళ్ళ యువకుడు వారి వద్దకి వచ్చి "సార్, మీరు టూరిస్టులా?" అని ప్రశ్నించాడు. సన్నగా, తెల్లగా వున్నాడతను. పైకి దువ్విన తల, లోతుకుపోయిన కళ్ళు, తెల్ల షర్టు- నల్ల ప్యాంట్ ధరించి టక్ చేసుకొని వున్నాడు.

మాసిన గడ్డం, అక్కడక్కడా చిరిగిన షూతో చదువుకున్న నిరుద్యోగిలా వున్నాడతను.

"మీరు టూరిస్టులా?" తనవైపే చూస్తున్న అభిరాం, మహదేవ్‌లని తిరిగి ప్రశ్నించాడతను.

"అవును!" అన్నాడు అభిరాం.

"నేను గైడ్‌ని కాదు కానీ ఈ స్థలం, రాజసౌధం, ఈ ప్రదేశం విశిష్టతా వివరిస్తాను. నేనుండేది ఇక్కడే. ఓ ట్వంటీ రూపీస్ ఇప్పిస్తారా? భోజనం చేసి రెండు రోజులయింది" అర్థిస్తున్నట్టు అన్నాడతను.

అభిరాం, మహదేవ్ ఆశ్చర్యంగా చూశారతనివంక.

“ప్లీజ్ సర్” స్పష్టమైన ఉచ్చారణతో అన్నాడతను.

“ఓకే!” ముందుకు వెళ్తూ అన్నాడు అభిరాం.

“వరంగల్‌కి పూర్వం వున్న పేరు “ఓరుగల్లు”. క్రీ.శ. 11వ శతాబ్దంలో మహోన్నత దశ అనుభవించిన ఆంధ్ర కాకతీయ సామ్రాజ్యానికి ఈ పట్టణం రాజధానిగా వుండేది. కాకతీయాంధ్ర చక్రవర్తులలో గణపతిదేవుడు, తరువాత అతని కుమార్తె రుద్రమదేవి ఆ పిమ్మట ఆమె మనుమడు ప్రతాపరుద్రుడు ఈ నగరాన్ని పాలించారు. ప్రతాపరుద్రుని కాలంలో ఓరుగల్లు పట్టణం ఏడుసార్లు మహమ్మదీయుల దండయాత్రలకు గురయింది. చివరకు క్రీ.శ. 1323లో మహమ్మద్- బీన్- తుగ్లక్ ప్రతాపరుద్రుని ఓడించి ఓరుగల్లు పట్టణాన్ని వశపరుచుకున్నాడు” ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడతను.

అభిరాం అతని మాటల్ని పట్టించుకోకుండా అటు యిటు చూడసాగాడు.

మహదేవ్‌కి అతను చెప్పిన విషయాల్లో కొన్ని ఇదివరకే తెలుసు. అయినా శ్రద్ధగా వినసాగాడు.

“ఈ దుర్గాన్ని చూసినవారికి సాంచీ స్థూప తోరణాలు జ్ఞాపకానికి వస్తాయి. ఇక రాజసౌధంలో అద్భుతమైన శిల్పాలూ, కళాఖండాలు అనేకం వున్నాయి. మనం ఇప్పుడు అక్కడికే వెళుతున్నాం ..... ” అంటూ కుడివైపుకు తిరిగాడతను.

ఒకప్పటి వైభవానికి గుర్తుగా, ఎన్నో శతాబ్దాల చరిత్రని తనలో నిక్షిప్తం చేసుకున్న రాజసౌధం నేడు పూర్వపు ఠీవీ కోల్పోయి మౌనిలా వుంది.

అందరూ లోపలికి నడిచారు.

అక్కడ ఎటు చూసినా రకరకాల భంగిమలలో అద్భుతమైన శిల్పాలు- ఆనాటి శిల్పుల నైపుణ్యతకి సాక్షీభూతాలై ప్రత్యక్షమయ్యాయ్.

అభిరాం వాటిని యథాలాపంగా చూస్తూ నెమ్మదిగా ముందుకు నడుస్తున్నాడు.

మహదేవ్ మాత్రం ఆ శిల్పాల్లోని ఉట్టిపడుతున్న జీవకళనీ, ఆ శిల్పాలు మలవటానికి ఆనాటి శిల్పులు కనపరిచిన ప్రతిభనీదీక్షగా అధ్యయనం చేస్తూ, ఒక్కో శిల్పం ముందు ఆగి, ఆగి ముందుకు సాగుతున్నాడు. అతి సున్నితంగా, సుందరంగా తీర్చిదిద్దిన చూరు అంచులూ, మనోహరంగా కూర్చిన ముత్యాల మాలలూ, గుబురు గుబురుగా వున్నట్టుండే చిన్న చిన్న ప్రతిరూపాలు అతన్నెంతో ఆకర్షించాయి. ఇంకొంచెం ముందుకు నడిచాడు. అక్కడ మదించిన ఏనుగులపై తాండవ నృత్యం చేసే రాక్షస చిత్రాలు భూత చిత్రాలూ ఎన్నో వున్నాయి.

అభిరాం వాటివంక దీక్షగా చూస్తున్నారు.

“ఊఁ ..... నీకిష్టమైన శిల్పాలు కూడా వున్నాయ్” నవ్వుతూ అన్నాడు మహదేవ్.

అతడు చిన్నగా నవ్వాడు. నిజానికి అతడు అక్కడికొచ్చింది అవి చూడటానికే.

“ఈ భూత చిత్రాలున్నాయి కదా ..... వీటి వెనుక కథ మీకేమయినా తెలుసా?” తమతో వచ్చిన యువకుడిని అడిగాడు అభిరాం.

“ఓరుగల్లుని గణపతిదేవుడు పాలించే సమయంలో ఆయన హయాంలో కొందరు తాంత్రికులు వుండేవారట. రాజసౌధానికీ, రాజవంశానికీ, ఓరుగల్లు నగరానికి ఏ దుష్టశక్తుల పీడలూ, ఆటంకాలూ రాకుండా వుండటానికి ఆ తాంత్రికులు యిచ్చిన సలహా వలన ఈ చిత్రాలు చెక్కించబడ్డాయని అంటారు. అదెంతవరకూ నిజమో ఎవరికీ తెలియదు” అన్నాడతను.

“ఇక చూడటానికి ఇక్కడేమీ లేవా?” అని అడిగాడు మహదేవ్.

“ఇంతే” అన్నాడతను.

అభిరాం అతనికి ఇరవై రూపాయలు ఇవ్వగానే అక్కడినుండి వెళ్ళిపోయాడతను.

“ఇప్పుడు హనుమకొండ వెళ్ళి అక్కడున్న వేయి స్థంభాల గుడిని చూద్దాం” అన్నాడు అభిరాం.

“ఓకే!” అన్నాడు మహదేవ్.

*  *  *  *  *

సరిగ్గా ఇరవై అయిదు నిమిషాల్లో చేరుకున్నారక్కడికి. అక్కడ చాలామంది టూరిస్టులున్నారు.

నిజంగా కాకతీయ వంశానికి చెందిన రాజులది అద్భుతమైన అభిరుచి.

దానికి నిదర్శనంగా కన్పిస్తుంది అందమైన ఆ ఆలయం. ద్వారాలపై చక్కని శిల్పాలు ఎంతో అందంగా మలచబడి వున్నాయి. ఒక ఎత్తయిన వేదికమీద నిర్మించబడిన నంది విగ్రహం చూస్తున్న వారందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తేలా వుంది.

అభిరాం, మహదేవ్ అబ్బురంగా వాటినన్నింటిని చూస్తూ ముందుకు నడిచారు.

సరిగ్గా అప్పుడు జరిగిందా సంఘటన .....

మహదేవ్ అపూర్వమైన ఆ దేవాలయాన్నీ, నందినీ మళ్ళీ మళ్ళీ చూస్తూ నడుస్తున్నాడు.

అదే సమయంలో బవిరిగడ్డం, కాషాయ వస్త్రాలు, మెడలో రుద్రాక్షమాలలు, తైల సంస్కారం లేక రాగి రంగులోకి తిరిగిపోయిన జడలు కట్టిన జుట్టుతో, ఉన్న ఓ సాధువు ఏదో ట్రాన్స్‌లో వున్నట్టు అర్ధ నిమీలిత నేత్రధారుడైన లోలోన మంత్రాలు పఠిస్తూ వస్తున్నాడు. అతని వయస్సు అరవైదాకా వుంటుంది. ఆరడుగులను మించిన ఎత్తున్నాడతను.

మహదేవ్, ఆ సాధువు యిద్దరూ ఎవరి ధ్యాసలో వాళ్ళుండి ఒకరినొకరు ఢీకొన్నారు. మహదేవ్ ఉలిక్కిపడి చూశాడు. ఆ సాధువు తపస్సు చెదిరిన మునిలా కళ్ళెత్తి అతనివంక చూశాడు.

“దిక్కులు చూస్తూ నడవరాదు నాయనా. మన గమ్యం వైపు సూటిగా సాగిపోవాలి” అని అన్నాడా సాధువు గంభీరంగా.

అతని మాటలకీ, రూపానికీ మహదేవ్‌కి ఒక్కసారిగా అరికాలిమంట నెత్తికెక్కింది.

“నేను దిక్కులు చూస్తున్నాను సరే ..... మరి నువ్వెందుకు నన్ను గమనించలేదు” తీవ్రంగా అడిగాడు.

తన వయసులో సగంలేని అతడు తనని ఏకవచనంతో సంబోధించడం ఆ సాధువుకి కోపం తెప్పించింది. అయినా అతనేం మాట్లాడలేదు.

“నీలా సాధువులు, బాబాలమంటూ గారడీ విద్యలు ప్రదర్శించి అమాయకులయిన ప్రజల్ని మోసగించి పేరు, డబ్బు గడించే వారివల్లే దేశం ఇలా తగలబడిపోతోంది. శరీరకష్టం చేయకుండా బాబాలనే ముసుగు ధరించడం, రాజకీయ నాయకుల ప్రాపకం సంపాదించి గొప్ప పేరు, కోట్లకొలదీ ఆస్థులు కైవశం చేసుకోవడం, దేశమంతా ఆశ్రమాలు కట్టి సంఘ వ్యతిరేక కార్యక్రమాలు చేయడం ..... ఇదే కదా మీ లక్ష్యం ..... ” బాబాలు, స్వాములమీద తనకుండే చీత్కారాన్ని పరుషంగా వెల్లడించాడతను.

అభిరాం గబగబ వచ్చాడు అక్కడికి. “ఏమైంది మహదేవ్?” అనడిగాడు.

“ఏమి కాలేదు నాయనా!” అన్నాడు సాధువు.

“ మహదేవ్ ఢీకొన్నప్పుడు ఆ సాధువు కాలికి అతని కాలిగోరు తగిలి సాధువు కాలినుంచి నెత్తురు చిందుతోంది. అది గమనించి అభిరాం. “రక్తమొస్తుంది గుడ్డతో అదిమిపెట్టండి” అన్నాడు సాధువుతో.

“ఫర్వాలేదు” అన్నాడతను.

“మంత్రాలు, తంత్రాలు, సాధువులు. బాబాలు ..... ఓహ్ ..... ఇరవై ఒకటవ శతాబ్దంలోకి దూసుకెళుతున్నా, ఈ జాఢ్యం మాత్రం మనదేశాన్ని వదలటం లేదు” కోపంగా అన్నాడు మహదేవ్.

“అలా అనకు మహదేవ్. స్వామీ పొరపాటు జరిగిపోయింది క్షమించండి” అని అతన్ని వేడికోలుగా అభ్యర్థించాడు అభిరాం.

“ఎందుకు క్షమించడం? నాలాగే అతడూ పరధ్యానంలో వుండటంతో ఒకరినొకరం ఢీకొన్నాం. పద పోదాం.” అన్నాడు మహదేవ్ నిర్లక్ష్యంగా.

ఆ క్షణంలో మహదేవ్ వంక ఆ సాధువు చూసిన చూపు తన ఎరని వేటాడబోయే పెద్దపులిలా మారడం అభిరాం గమనించాడు.

“మన్నించండి స్వామి” అని “పద మహదేవ్ పోదాం” అతన్ని తొందరచేస్తూ అన్నాడతను.

“నీ స్నేహితుడు ఆవేశంలో వున్నాడు నాయనా! ఆవేశం అనర్థాలకి మూలం” గంభీరంగా అన్నాడు సాధువు.